వైద్యుల రక్షణకు కఠిన చట్టాలు అవసరం



ప్రజలకు సేవలందించే వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారం ఘటన సభ్య సమాజానికి మాయని మచ్చ. అన్ని ఆస్పత్రుల్లో వైద్యులు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలి. రోజుల తరబడి కుటుంబ సభ్యులకు దూరంగా ఉండి విధులు నిర్వహించే వైద్య సిబ్బంది భద్రత కోసం కఠిన చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉంది.

– పి.అరుణ, స్టాఫ్ నర్స్, పెదగంట్యాడ పీహెచ్‌సీ

వైద్య సిబ్బంది భద్రతకు ప్రాధాన్యమివ్వాలి



వైద్య సిబ్బంది భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యమివ్వాలి. ఆస్పత్రుల్లో వైద్య సిబ్బందికి రక్షణ కల్పిస్తే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుంది. కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచారం వంటి అమానవీయ ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా మహిళా డాక్టర్లు, సిబ్బందికి రక్షణగా ఆస్పత్రుల్లో మహిళా కానిస్టేబుళ్లను నియమించాలి. ఆస్పత్రుల్లో అవసరమైన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిత్యం పర్యవేక్షించాలి.

– డాక్టర్ ప్రదీప్ ప్రసాద్‌రాజా, వైద్యాధికారి, దేవాడ పీహెచ్‌సీ

మళ్లించకుంటే ముప్పే



అంతా ఇష్టారాజ్యం : పాతగాజువాక 60 అడుగుల రోడ్‌లో నిలిపి ఉంచిన ప్రైవేట్ ట్రావెల్ బస్సులు



నిత్యం ఇదే దుస్థితి : అగనంపూడి వద్ద ట్రాఫిక్ స్తంభించడంతో నిలిచిపోయిన వాహనాలు

- జాతీయ రహదారిపై భారీగా పెరుగుతున్న ట్రాఫిక్
- భారీ వాహనాల రాకపోకలతో ప్రమాదాలు
- ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలంటున్న ప్రజా సంఘాలు

గాజువాక: గాజువాక నియోజకవర్గ పరిధిలోని జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరిగిపోతోంది. భారీ వాహనాలు, వివిధ పరిశ్రమల నుంచి బొగ్గుతోపాటు వివిధ ఇబ్బందికరమైన మెటీరియల్‌తో రాకపోకలు సాగిస్తున్న వాహనాలతో జనం ఆందోళనకు గురవుతున్నారు. అదుపులేని వేగంతో నడుస్తున్న వాహనాల వల్ల ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ఈ పరిస్థితిని అదుపు చేయాల్సిన యంత్రాంగం పట్టనట్టు వ్యవహరిస్తోందన్న ఆరోపణలున్నాయి. అగనంపూడి నుంచి షీలానగర్ వరకు జాతీయ రహదారిపై నిత్యం ఇదే పరిస్థితి చోటుచేసుకుంటోంది. నిర్దిష్ట సమయమంటూ లేకుండా నగరంలోకి రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాల కారణంగా ప్రమాదాలు కూడా పెరుగుతున్న విషయం తెలిసిందే. గాజువాక పట్టణ పరిధిలో ఇటీవల చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల కారణంగా 15 మంది మృతి చెందినట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలంటూ ప్రజా సంఘాలు సైతం గొంతు వినిపిస్తున్నాయి.

భారీ వాహనాలతో ట్రాఫిక్ సమస్యలు

విశాఖ నగరం నుంచి ఫార్మాసిటీ, బ్రాండిక్స్ తదితర కంపెనీలకు సుమారు 220 ట్రావెల్ బస్సులు తిరుగుతున్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఉదయం, సాయంత్రం సమయాల్లో పాఠశాలలకు రాకపోకలు సాగిస్తున్న వేలాది మంది పిల్లలు ఈ భారీ వాహనాల కారణంగా అవస్థలు ఎదుర్కొంటున్నారు. పాఠశాల సమయాల్లో సైతం భారీ వాహనాలు పట్టణంలో రాకపోకలు సాగిస్తుండడంతో వారంతా ఇబ్బంది పడుతున్నారు. తమ పిల్లలను పాఠశాలలకు పంపిస్తున్న తల్లిదండ్రులు



చినగంట్యాడ వందడుగుల రోడ్‌లో భారీ వాహనాలు

ఎప్పుడేం జరుగుతుందోనని నిత్యం ఆందోళనకు గురవుతున్నారు. వివిధ కంపెనీలకు తమ ఉద్యోగులను తీసుకెళ్లడం కోసం పెద్ద పెద్ద ట్రావెల్ బస్సులు సైతం వీధి రోడ్లలో విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. అదే సమయంలో పాఠశాలలకు పిల్లలను తీసుకెళ్లేందుకు ఆటోలు, బస్సులు కూడా రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ కారణంగా రోజు ట్రాఫిక్ జామ్ సమస్యగా మారింది. ప్రధాన జంక్షన్లలో భారీగా ట్రాఫిక్ స్తంభించిపోవడం నిత్యకృత్యమైంది. భారీ వాహనాల పార్కింగ్‌తో ఒకపక్క హైవేతోపాటు మరోపక్క కాలనీల్లో రోడ్లు కూడా పార్కింగ్ యార్డులుగా మారిపోతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించడం కోసం అగనంపూడి నుంచి షీలానగర్ వరకు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. నిర్దిష్టమైన సమయాల్లో మాత్రమే భారీ వాహనాల రాకపోకలను అనుమతించాలని కోరుతున్నారు.

నిర్దిష్ట సమయంలో అనుమతిస్తే...

లంకెలపాలెం నుంచి షీలానగర్ వరకు భారీ వాహనాలను అనుమతించే విషయంలో సమయాలను నిర్ణయించాలని పలువురు కోరుతున్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు భారీ వాహనాలను నిలుపుదల చేయాలని, సిటీ ట్రావెల్స్ ఎక్కడబడితే అక్కడ ఆపకుండా వాటిని నిలుపుదల చేయడానికి కొన్ని ప్రత్యేక స్టాపులను ఏర్పాటు చేయాలని గాజువాక వాసులు విన్నవిస్తున్నారు. ఈ విషయంలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో అనుసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేయాలని కోరుతున్నారు.

31న ఈపీఎస్ - 95 పెన్షనర్ల అసోసియేషన్ సమావేశం

ఉక్కునగరం : ఈపీఎస్ – 95 పెన్షనర్ల అసోసియేషన్ రెండో వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం) ఈ నెల 31న నిర్వహించనున్నారు. ఉక్కు అధికారుల సంఘం (సీ) భవన్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి అసోసియేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.రాజశేఖర్ అధ్యక్షత వహించనున్నారు. జాతీయ గౌరవ అధ్యక్షుడు మంత్రి రాజశేఖర్, వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నట్టు జాతీయ ఉపాధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు తెలిపారు. ఈపీఎస్ – 95 పెన్షనర్లు అందరూ సమావేశంలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఉక్కు యాజమాన్యంపై హైకోర్టు రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు

అగనంపూడి : ఉక్కు అధికారి మృతి, ఆ కుటుంబానికి న్యాయం చేసే విషయంలో చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌ను తప్పుదోవ పట్టించిన ఉక్కు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు రిజిస్ట్రార్‌కు సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు ఫిర్యాదు చేశారు. నాట్ర తాతారావు అనే ఉక్కు అధికారి విధి నిర్వాహణలో మృతి చెందినట్టు పోలీసులు ధ్రువీకరించడంతోపాటు... ప్రమాదంలో మరణించారని యాజమాన్య ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. అయితే తర్వాత యాజమాన్యం మాట మార్చడంతో తాము చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండడం వల్ల న్యాయం చేయలేకపోతున్నామని చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌ను తప్పుదోవ పట్టిస్తూ యాజమాన్యం సమాధానం ఇవ్వడంపై అప్పారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము 2023లో కేసు ఉపసంహరించుకున్నామని, అయితే న్యాయస్థానంలో కేసు పెండింగ్‌లో ఉందని బుకాయిస్తూ, న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించడంపై హైకోర్టు రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశామని అప్పారావు తెలిపారు.

క్లుప్తంగా

ఆరోగ్యకర జీవనశైలి అలవర్చుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం: నేషనల్ స్పోర్ట్స్ డే సెలబ్రేషన్స్ (ఎన్ఎస్‌డీ)ను ముందస్తుగా 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థులు ఎన్ఎస్‌డీ ప్రతిజ్ఞ చేశారు. పాఠశాల పీడీ ఇస్మాయిల్ మాట్లాడుతూ అంతర్జాతీయ హాకీ క్రీడాకారుడు స్వర్గీయ ధ్యాన్‌చంద్ పుట్టిన రోజును పురస్కరించుకొని నేషనల్ స్పోర్ట్స్ డే సెలబ్రేషన్స్ ఏటా ఆగస్టు 29న నిర్వహించుకుంటున్నామన్నారు. క్రీడాకారులు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం, ఉపాధ్యాయులు దేముళ్లు, కుమారస్వామి పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నిధులతో పశువైద్యశాల

అగనంపూడి: సీఎస్ఆర్ నిధులతో అగనంపూడి పశువైద్యశాల నిర్మాణానికి కలెక్టర్ హరేంధిర ప్రసాద్ చొరవ తీసుకోవడంపై వైద్యాధికారి డాక్టర్ లావణ్య హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల స్థానిక నాయకులు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కలెక్టర్‌ను కలిసి అగనంపూడి పశు వైద్యశాలకు స్థలం సిద్ధంగా ఉందని, నిధులు లేకపోవడంతో నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదని వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సీఎస్ఆర్ నిధులతో నిర్మాణం చేపట్టేందుకు ముందుకు రావడంతోపాటు సంబంధిత అధికారులు వెంటనే అంచనాలు తయారు చేయాలని ఆదేశించారని, ఈ మేరకు తమకు సమాచారం అందిందని లావణ్య తెలిపారు. సొంత భవనం సమకూరితే ప్రయోజనకరంగా వుంటుందని ఆమె పేర్కొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుని అవతారంలో పూజలందుకుంటున్న శ్రీనివాసుడు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్య క్షేత్రంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహంతో పల్లకీ సేవ నిర్వహించారు. ప్రాంగణంలో ఉట్టి కొట్టే కార్యక్రమంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీకృష్ణుని అవతారంలో శ్రీనివాసుడు పూజలందుకున్నా రు. శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

పెన్షన్ బకాయిలు చెల్లించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న విదసం నాయకులు

మహారాణిపేట: గత నెలలో సామాజిక పెన్షన్లు తీసుకోలేని వారికి సెప్టెంబర్ నెల పెన్షన్‌తో కలిపి బకాయిలు చెల్లించాలని కోరుతూ మంగళవారం విదసం ప్రతినిధులు కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం విదసం కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ గత నెల కొందరు వృద్ధులు, వికలాంగులు జూలై, ఆగస్టు మాసాల్లో పెన్షన్లు పొందలేకపోయారని, వారికి సెప్టెంబర్‌లో చెల్లించే పెన్షన్‌తో కలిపి బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ద్వారా ప్రభుత్వాన్ని కోరామన్నారు. ఈతలపాక సుజాత, బాజీ ఓంకార్, కస్తూరి వెంకటరావు, రవి సంతోష్, ములంపాక అఖిల్ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటం ఉధృతం చేస్తాం



మాట్లాడుతున్న ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ ఆదినారాయణ

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో మంగళవారం 1293వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కును కాపాడుకోవడానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలను చైతన్యవంతులను చేసి ప్రజా మద్దతు కూడగట్టి కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా చేస్తామన్నారు. ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని, తక్షణ సాయంగా రూ.5 వేల కోట్ల నిధులు విడుదల చేయాలని మొరపెట్టుకుంటున్నా కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. ప్రజాధనంతో నిర్మించిన విశాఖ ఉక్కును ప్రైవేటీకరించాలని చూడడం సబబుకాదన్నారు. కార్యక్రమంలో వరసాల శ్రీనివాసరావు, మసేనురావు, కె.రాజబాబు, జి.జయ, తాండ్ర కనకరాజు, ఎ.శివరామకృష్ణ, తుమ్మల శ్రీనివాస్, జి.ఆనంద్, కర్రి బాబూరావు, ఎం.శ్రీనివాస్, డి.దేముడు, గంటా రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణుని విగ్రహ ఊరేగింపు



శ్రీకృష్ణుడి విగ్రహం ఊరేగిస్తున్న ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు

గాజువాక : శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని ఊరేగింపు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాత గాజువాక నుంచి శ్రీనగర్ దరి విశ్వేశ్వరయ్యనగర్ కాలనీ వరకు ఊరేగింపు సాగింది. ఈ సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు శ్రీనివాస్, రమణ, అప్పలనాయుడు, రామకృష్ణ, రమేష్, విజయ్, అరుణ్ కుమార్, లక్ష్మీదేవి, మంగ, శ్రేయ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నెలా ఒకటిన కార్మికులకు జీతాలు చెల్లించాలి



స్టీల్‌ప్లాంట్ సీజీఎం శ్రీధర్‌ను అభినందిస్తున్న యూనియన్ నాయకులు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ కార్మికులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని బీఎంఎస్, టీఎన్‌టీయూసీ, డీఎస్ఈయూ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్)గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన యు.శ్రీధర్‌ను మంగళవారం నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాంట్‌లో ఉన్న స్క్రాప్‌ను త్వరితగతిన ఉపయోగించి లాభం చేకూర్చాలన్నారు. ప్లాంట్ సమస్యలను తమకు తెలియజేస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. దీనిపై సీజీఎం మాట్లాడుతూ రెండు నెలల్లో ప్లాంట్‌కు మంచి పరిస్థితి వస్తుందని, అంత వరకు ఓపిక పట్టాలన్నారు. ప్లాంట్ పరిరక్షణకు తాము ఉమ్మడిగా సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గుమ్మడి నరేంద్ర, నమ్మి సింహాద్రి, కొమ్మినేని శ్రీనివాసరావు, రామస్వామి, పి.ఎస్.ఆర్.లక్ష్మణరావు, అట్ట అప్పారావు, మణికుమార్, లక్ష్మణ్, వియ్యపు చిన్న తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పని దినాలు తగ్గింపు తగదు



స్టీల్‌ప్లాంట్‌లో విభాగాధిపతి కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల పని దినాల తగ్గింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని స్టీల్ సీఐటీయూ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. యాజమాన్యం కార్మికుల పని దినాలు తగ్గింపుపై తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా మంగళవారం ప్లాంట్‌లోని పలు విభాగాల అధిపతుల కార్యాలయాల వద్ద ధర్నా చేశారు. ధర్నాలో నాయకులు మాట్లాడుతూ యాజమాన్యం ఉత్పత్తి పెంపు చర్యలు చేపట్టకుండా కాంట్రాక్ట్ కార్మికులను తొలగించే చర్యలకు పాల్పడుతోందన్నారు. బయోమెట్రిక్ లోపాలను సరిదిద్దకుండా కార్మికుల జీతాల్లో కోత విధిస్తామంటే అంగీకరించబోమన్నారు. కార్మికులను ఇబ్బందులకు గురి చేయడం ఆపకపోతే ఈ నెల 30న ఈడీ (వర్క్స్) బిల్డింగ్ ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో జి.శ్రీనివాసరావు, కె.ఎం.శ్రీనివాస్, ఓ.వి.రావు, నమ్మి రమణ, కె.పి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులకు శిక్షణ



మాట్లాడుతున్న ఎంఈవో త్రినాథరావు

మల్కాపురం: బాలల హక్కులపై ప్రధానోపాధ్యాయులకు ఎంఈవోలు అవగాహన కల్పించారు. జీవీఎంసీ 61వ వార్డు వెంకన్నపాలెంలో విజ్ఞాన్ హైస్కూల్ వద్ద మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ములగాడ మండల పరిధిలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవోలు డి.వి.త్రినాధరావు, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, చిన్నారులు చెడు అలవాట్లకు గురి కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలను వివరించారు. పిల్లలను సెల్‌ఫోన్, వీడియో గేమ్స్ నుంచి తప్పించి, చదువుపై దృష్టి మళ్లించే విధంగా కౌన్సెలింగ్ నిర్వహించడం, బాగా చదువుకుంటే భవిష్యత్తు ఎలా ఉంటుంది తదితర అంశాలను విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్ పార్వతి పాల్గొన్నారు.

మానవ మృగాలకు ఉరే సరి



అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న పలు సంఘాల నాయకులు

గోపాలపట్నం: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై ఘాతుకానికి పాల్పడిన మానవ మృగాలను ఉరి తీయాలని ప్రజా సంఘాల ప్రతినిధులు, హెల్త్ వలంటీర్లు డిమాండ్ చేశారు. 91వ వార్డు లక్ష్మీనగర్ ఈ–బ్లాక్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మృతురాలికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా విదసం ఐక్యవేదిక కో–కన్వీనర్ సోడదాసి సుధాకర్ మాట్లాడుతూ జూనియర్ వైద్యురాలిపై జరిగిన ఘటన దారుణమని, దానిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. దోషులు ఎంతటి వారైనా ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేశారు. రైల్వే యూనియన్ నాయకుడు డెంకాడ ఆనంద్ మాట్లాడుతూ జూనియర్ డాక్టర్ల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలన్నారు. హెల్త్ వలంటీర్ అనూష మాట్లాడుతూ ప్రాణాలను నిలబెట్టే వారిపై మృగాల్లా ప్రవర్తించడం దుర్మార్గమన్నారు. ఇలాంటి వారు సభ్య సమాజంలో బతికే అర్హత కోల్పోయారన్నారు. అలాంటి వారిని రక్షించేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే సమాజాన్ని ప్రమాదకర పరిస్థితిలోకి నెట్టేయడమే అవుతుందన్నారు. ఇటువంటి చర్యలను ముక్తకంఠంతో వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు బండారు తులసీరామ్, కె.సంజీవరావు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భూ బాధితులకు న్యాయం చేయాలి



భూ బాధితుల రాష్ట్ర సదస్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

పెదగంట్యాడ : రాష్ట్రంలో భూ బకాసురులు ఆక్రమించిన భూములపై సమగ్ర విచారణ జరిపించి భూ కబ్జాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కసిరెడ్డి సత్యనారాయణ డిమాండ్ చేశారు. అలాగే భూ బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు పోతిన సన్యాసిరావు భవన్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న విజయవాడలో భూ బాధితులతో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ సదస్సుకు భూ బాధితులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. అనంతరం భూ బాధితుల రాష్ట్ర సదస్సు పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎల్లేటి శ్రీనివాసరావు, ఆనంద్, పల్లేటి పోలయ్య, అచ్యుతరావు, దుర్గారావు, పోతన్న, అప్పారి విష్ణుమూర్తి పాల్గొన్నారు.

సింహాద్రప్పడు సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

సీతంపేట : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గుల్లిపల్లి సింహాద్రప్పడు వర్ధంతి సందర్భంగా అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో పలువురు ఘనంగా నివాళులర్పించారు. ఏపీ టీచర్స్ ఫెడరేషన్ విశాఖ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు, సీతమ్మధార మండల అధ్యక్ష కార్యదర్శులు బి.దేముడుబాబు, పి.ఎస్.రెడ్డి తదితరులు సింహాద్రప్పడు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం, ఉద్యమం మరువలేనిదని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు రాజు, కె.ఎస్.వి.రమణ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో రెండు ఇళ్లల్లో చోరీ

అక్కిరెడ్డిపాలెం : ఒకే ప్రాంతంలో రెండు అపార్ట్‌మెంట్ల సెల్లార్‌లలో నివసిస్తున్న వాచ్‌మెన్‌ల ఇళ్లల్లో దొంగతనాలు జరిగాయి. ఇస్త్రీ పెట్టె, వెండి సామగ్రి దొంగలు ఎత్తుకెళ్లారు. గాజువాక క్రైం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గాజువాక ఉడా కాలనీ, వినాయక్‌నగర్‌లో వీఎస్ఆర్ ఎబాడ్స్ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో నాలుగు సంవత్సరాలుగా వాచ్‌మెన్‌గా కె.సన్యాసిదేముడు పనిచేస్తున్నాడు. అపార్ట్‌మెంట్ వాసుల దుస్తులు ఉతికి ఇస్త్రీ చేస్తూ జీవనాన్ని సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం వేకువజామున ఇస్త్రీ పెట్టె అపహరణకు గురైనట్లు గుర్తించి గాజువాక క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

- గాజువాక ఉడా కాలనీ, వినాయక్‌నగర్‌లో మురారి(ఎన్) హైట్స్ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో నివసిస్తున్న ఒక వాచ్‌మెన్ ఇంట్లో అర్ధరాత్రి దొంగలు పడి 4 తులాల వెండి చైను, వెండి ఉంగరం దొంగిలించినట్లు గాజువాక క్రైం పోలీసులకు కుటుంబ సభ్యులు పిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి కార్యాలయంలో ఇంటర్వ్యూలు

కంచరపాలెం : స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో 30న శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి నిట్టాల శ్యామ్ సుందర్ తెలిపారు. ఎస్సార్ అకాడమీ, శ్రీరామ్ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల్లో 50 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. టెన్త్, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు కంచరపాలెం ఐటీఐ కూడలిలో గల జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఉదయం ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని ఆయన కోరారు.

మున్సిపల్ శాఖ మంత్రికి సమస్యల మొర

డాబాగార్డెన్స్: విశాఖ విచ్చేసిన మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణను గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎం.ఆనందరావు నేతృత్వంలో కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలంటూ మొర పెట్టుకున్నారు. వుడా కార్యాలయంలో మంగళవారం మంత్రిని కలిసి పలు సమస్యల పరిష్కారానికి సంబంధించి వినతిపత్రం అందజేశారు. జీవీఎంసీలో గత 30 ఏళ్లుగా పని చేస్తున్న ఎంటీఎస్, ఎన్ఎంఆర్ ఉద్యోగులను రెగ్యుల ర్ చేయమని కోరారు. మంత్రి స్పందిస్తూ రాష్ట్రవ్యాప్తంగా జీవో 212కు ఎంత మంది అర్హత పొందుతారని అడగ్గా, సుమారు 800 మంది ఉంటారని ఆనందరావు తెలిపారు. అలాగే మున్సిపల్ శాఖలో పని చేస్తున్న ఇంజినీరింగ్, వాటర్ సప్లై ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అన్‌స్కిల్డ్‌కు రూ.21 వేలు, సెమీ స్కిల్డ్‌కు రూ.24,500 జీవో 36 ప్రకారం చెల్లించాలని, గత 20 ఏళ్లుగా ఎంఏ అండ్ యూడీ డిపార్టుమెంట్‌లో పీహెచ్, నాన్ పీహెచ్ వర్కర్లకు ఒకే రకమైన జీతాలు ఉండేవని మంత్రికి వివరించారు. 9 మంది అధికారుల కమిటీ రిపోర్ట్ ఫైనాన్స్ డిపార్టుమెంట్ వద్ద పెండింగ్‌లో ఉందని తెలపగా మంత్రి స్పందిస్తూ సెప్టెంబర్ చివరి నాటికి కార్మికులు, ఉద్యోగుల డిమాండ్లపై జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి, రెండు నెలల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఆనందరావు తెలిపారు.